కథా నిలయం
3520
శ్రీకాకుళం

# బకాసురుడు

ఆ కార్యాలయంలో కొత్త ఆఫీసర్ని వేశారు. ఆయన పేరు బకాసుర్రావు. ఆవేళే డ్యూటీలో జాయినవుతున్నాడు..

ఆయన పేరు వినీ వినడంతోనే హడలిపోయారు స్టాఫ్. పేరుకు తగ్గట్టు రాబోయే అధికారి చండశాసనుడని, పనిలో ఏమాత్రం శ్లాక్‌నెస్ చూపినా కఠినంగా వ్యవహరిస్తాడని, లేట్ కమర్సుని అసలే క్షమించడని ఇలా రకరకాల మాటలు వినవచ్చాయి.

సిబ్బందిలో సోమరులుగా ప్రసిద్ధి చెందిన సుబ్బారావు, అప్పారావుల సంగతి వేరే చెప్పనక్కరలేదు. వాళ్ళ గుండెల్లో రాకెట్లు పరుగెడుతున్నాయన్నా అతిశయోక్తి కాదేమో!

ఆ రోజు ఆఫీసు టైముకి అరగంటముందే అంతా వచ్చేసి శ్రద్ధగా పనిచేసుకుంటున్నారు. వర్కు చేసుకుంటున్నారన్న మాటేగాని అందరి మనసులలో బకాసురుడే పరిభ్రమిస్తున్నాడు.

సరిగ్గా పది గంటకి ఆఫీసు ముందు కారాగింది. పరుగున వెళ్ళి డోర్ తెరిచాడు అటెండరు అప్పన్న. కారు దిగి హుందాగా గదివైపు నడిచాడు బకాసుర్రావు. గౌరవసూచకంగా స్టాఫ్ నిలబడి రెండు చేతులు జోడించారు. వారి వందనాన్ని స్వీకరించడనాకి మనస్సంగీకరించపోవడంతో తల మాత్రం ఆడిస్తూ లోనికి దారి తీశాడు.

బరువుగా శ్వాసతీసుకున్నారంతా.

“చూశారా. నేను చెప్పలా బాస్ విషయం? కనీసం మన నమస్కారాన్ని కూడా

ఖాతరు చేయని అతని నైజం ఎటువంటిదో మీరే అర్థం చేసుకోండి" అన్నాడు హెడ్ క్లర్కు గురునాథం.

అతని మాటలకు మరింతగా భయపడి పోయారు స్టాఫ్.

"మన స్టాఫ్ అందర్నీ ఇంట్రడ్యూస్ చెయ్యమంటారా?" అడిగాడు యూనియన్ సెక్రటరీ సన్యాసిరావు లోపలకొస్తూ.

అతన్నోమారు తీక్షణంగా చూసి "అక్కర్లేదు. డోంట్ డిస్టర్బ్ దెమ్. ఎవరి పని వారు చేసుకోనివ్వండి." తిరిగి తను చూస్తున్న ఫైలు వంక దృష్టి సారించాడు బకాసుర్రావ్.

మరి పెదవులు విడలేదు సన్యాసిరావుకి.

రోజులు దొర్లుతున్నాయి. బాస్ ఎవరికి ఎప్పుడు మెమో ఇస్తాడోనన్న భయంతో తలవంచి పనిచేస్తున్నారంతా.

ఒక రోజు.........

బాస్ పిలవడంతో పిడికెట్లో ప్రాణాలు పెట్టుకుని వణికి పోతూ ఆఫీసరు దగ్గరికెళ్ళాడు మురళి.

మురళి ఆ ఆఫీసులో సీనియర్ క్లర్క్. సుమారు పద్దెనిమిదేళ్ళ సర్వీసుంటుంది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఇంతవరకూ అతనికి ప్రమోషన్ లేదు. వచ్చిన ప్రతి ఆఫీసర్‌తో తన గోడు వెళ్ళబోసుకుంటూనే ఉన్నాడు. దానికి వారంతా ఊరంత సానుభూతి చూపించి పైకి రాస్తామంటూ కాలయాపన చేసేశారు.

ఇప్పుడు కొత్తగా వచ్చిన ఆఫీసర్ని చూస్తేనే గుండెదడ రావడంతో అతని ముందు ఆ ప్రసక్తి తేవడానికి ధైర్యం చాలటంలేదు.

"నమస్తే". వందనాన్ని స్వీకరించే అలవాటు అతనికిలేకున్నా తమ బాస్ అనే గౌరవంతో చేతులు జోడించి నిలబడ్డాడు మురళి.

"ఇప్పుడే నీ యస్.ఆర్. రిఫర్ చేశాను."

కొంపతీసి తన ఇంక్రిమెంట్ ఆపేయాలనుకుంటున్నాడో ఏమో! మాట్లాడలేదు మురళి. అతని కళ్ళల్లో అవ్యక్తమైన ఆందోళన ప్రస్ఫుటతమవుతూంది.

"సీనియారిటీ, సిన్సియారిటీ అన్నీ వున్న నీకు ఇంతవరకు ప్రమోషన్ రాకపోవడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పుడే నీ గురించి పైకి రాయాలనుకుంటున్నాను. ఈ సంగతి చెప్పేందుకే పిలిచాను."

మురళి కళ్ళకు బకాసుర్రావు దేవుడిలా కనిపించాడు. ఇంతవరకూ తన

ప్రమోషన్ విషయమై ఎంత మొర పెట్టుకున్నా ఏ అధికారీ పట్టించుకోలేదు. ఈయన అడక్కుండానే తన సర్వీసు రిజిస్టరు స్టడీ చేసి సిఫార్సు చేస్తానంటున్నాడు.

"థాంక్యూ వెరీమచ్ సార్" ఆనందంలో ఉక్కిరిబిక్కిరయ్యాడు మురళి. అప్రయత్నంగా అతని కనుకొలుకుల నుంచి రెండు నీటి బిందువులు రాలాయి.

"వెళ్ళి నీపని చేసుకో."

"అలాగే సార్. పోతే చిన్న సందేహం"

"ఏమిటోయ్?"

"మరేంలేదు సార్....." అడిగేందుకు సందేహించాడు మురళి.

"ఫరవాలేదు అడుగు." అభయమిచ్చాడు బకాసుర్రావు.

"మీరెంత మంచివారో నాకిప్పుడే అర్థమయింది. అయితే మా స్టాఫ్‌లో మీపైన....."

"సదభిప్రాయం లేదంటావు." మురళి నోటంట రావలసిన మాటల్ని పూర్తి చేశాడు బకాసుర్రావు.

తన మనసులో మాటల్ని ఫొటో తీసి చూపెట్టినట్లు అనేసరికి అవాక్కయిపోయాడు మురళి.

"ఐదేళ్ళ క్రితం నాకు చచ్చేంత జబ్బు చేసింది. వ్యాధి నయమైందిగాని కుడిచెయ్యి మాత్రం పడిపోయింది. ఈ చేయి అలంకారప్రాయమే తప్ప అంగుళం పైకి లేవదు. ఎందుకూ పనికిరాదు. ఎవరికైనా విష్ చేయాలంటే ఎడమ చెయ్యే శరణ్యం. ఆ చేతిలో వస్తువేదైనా ఉంటే నా కళ్ళే ఆ పని పూర్తి చేస్తాయి. నా అంగవైకల్యం చెబితే గాని అర్థమవని జనం నన్ను అపార్థం చేసుకుంటారు. ఆ విషయం నాకు బాగా తెలుసు" అంటూ చలనరహితమైన తన చేతిని కోటు తప్పించి చూపించాడు బకాసుర్రావు.

బాస్ స్థితిని కళ్ళారా చూస్తున్న మురళి కళ్ళు చెమ్మగిల్లాయి. మంచితనం అనేది మనిషి మాటల్లో కాదు- మనసు లోనే ఉంటుందని తెలుసుకున్నాడు.

● *ఆంధ్రప్రభ వీక్లీ 2-11-88.* ●